కారు దిగి కాంగ్రెస్‌లోకి..

- పార్టీ మారిన ఎంపీ రంజిత్ రెడ్డి
- అనుచరులతో మొయినాబాద్‌లో సమావేశం



మొయినాబాద్ ఫాంహౌస్‌లో అనుచరులతో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల వేళ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయాలు ఊహించని విధంగా మలుపులు తిరుగుతున్నాయి. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాంరాం చెప్పి ఆదివారం కాంగ్రెస్ గూటికి చేరారు. అంతేకాదు కాంగ్రెస్ కండువా కప్పుకున్న కొద్ది గంటలకే ఆయన మొయినాబాద్‌లో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వాస్తవానికి కొద్ది రోజులుగా ఆయన కాంగ్రెస్‌లో చేరతారని జోరుగా ప్రచారం జరుగుతున్నా ఆయన బయటపడ లేదు. ఆదివారం ఆకస్మాత్తుగా బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు రాజీనామా లేఖను పంపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు తన రాజీనామా విషయాన్ని ప్రజలకు సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. 'ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నాను. ఇంత కాలం తనకు పార్టీలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఇన్ని రోజులు చేవెళ్ల ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు..' అని పేర్కొన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని గులాబీ అధినేతను కోరారు.

అనుచరులతో భేటీ..

మొయినాబాద్ రూరల్: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నేపథ్యంలో మొయినాబాద్ మండల పరిధి ఎన్కేపల్లిలో గల క్యాంప్ కార్యాలయంలో తన అనుచరులతో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సమావేశమై సుదీర్ఘ చర్చలు చేశారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. చేవెళ్ల నుంచి పోటీచేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.



తెలంగాణ రోడ్ల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన చెప్పారు.

- ఎల్‌బీనగర్,ఆంధ్రజ్యోతి

మల్‌రెడ్డి రాంరెడ్డికి ఘనంగా సన్మానం

ఎల్‌బీనగర్, హయత్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన మల్‌రెడ్డి రాంరెడ్డిని ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, కౌన్సిలర్ కోశిక ఐలయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, సంరెడ్డి భుజంగరెడ్డి, బొక్క వంశీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చెన్నారెడ్డి, నరేందర్, ప్రసూన్‌రెడ్డి, పలువురు ఉన్నారు

తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మునగనూర్ అంజనాపురి కాలనీ ఆర్చీని ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి స్థానిక కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు సంగీత మోహన్, బొక్క రవీందర్‌రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ, కోశిక ఐలయ్య, నాయకులు కొత్తకుర్మ శివకుమార్, గుత్త వెంకట్‌రెడ్డి, అంజయ్య, వాసుతోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు



సుజాతకు అవార్డు అందజేస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

ఉత్తమ ఆరోగ్య కార్యకర్తగా సుజాత

సరూర్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ యూపీహెచ్‌సీలో పని చేస్తున్న బత్తిన సుజాతను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఆరోగ్య కార్యకర్తగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అవార్డు అందజేసి అభినందించారు. తనకు అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మున్ముందు మరింత బాధ్యతగా విధులు నిర్వర్తిస్తానని సుజాత పేర్కొన్నారు.

యువ సంఘం బస్సు యాత్ర ప్రారంభం

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా నిర్వహించే యువ సంఘం బస్సు యాత్రను ఈసారి నగరంలోని హెచ్‌సీయూలో ఆదివారం వీసీ, ప్రొఫెసర్ బీజేరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా పాట్నా ఎన్ఐటీ, హెచ్‌సీయూ విద్యార్థి బృందం బీహార్‌లో పర్యటించనుంది.

అదుపుతప్పి కారు బోల్తా

- ప్రాణాలతో బయటపడ్డ నలుగురు వ్యక్తులు
- కుత్బుల్లాపూర్ రోడ్డు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి
- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్



ప్రమాదంలో ధ్వంసం అయిన కారు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు తట్టిఅన్నారం నుంచి గౌరెల్లి వైపునకు ఓవర్ స్పీడుతో వెళ్తున్న కారు (బీఎండబ్ల్యూ) కుత్బుల్లాపూర్ రోడ్డు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ఓవర్ స్పీడుతో ఉన్న కారు డ్రైవర్‌కు మలుపు కనిపించకపోవడంతో అదుపు తప్పి ఒక్కసారిగా పల్టీలు కొడుతూ కుత్బుల్లాపూర్‌కు వెళ్లే రోడ్డు పక్కన బోల్తా పడింది. అయితే కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న నలుగురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు.

కుత్బుల్లాపూర్ రోడ్డు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్

తట్టిఅన్నారం నుంచి గౌరెల్లి రేడియల్ రోడ్డులో కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద మూల మలుపు ప్రమాదకరంగా మారిందని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్ తెలిపారు. గతంలో ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ మలుపు వద్ద ఆర్అండ్‌బీ, పోలీసులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే మలుపు వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గొలుసుకట్టు మోసాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గురుప్రీత్ సింగ్ ఆనంద్

పంజాగుట్ట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గొలుసుకట్టు మోసాలు నియంత్రించడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రీత్‌సింగ్ ఆనంద్ డిమాండ్ చేశారు. కొన్ని సంస్థలు పేర్లు మార్చుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నాయని, అలాంటి సంస్థల వలలో అమాయకులు పడవద్దని ఆయన సూచించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అనూజా కోటేచా, తెలంగాణ హెడ్ ఫణీంద్రతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల శంకర్పల్లి పీఎస్ పరిధిలో తండ్రి, తన ముగ్గురు కుమారులను చంపి, ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. క్యూనెట్ సంస్థ 1998 నుంచి వివిధ పేర్లతో చట్టవిరుద్ధమైన పోంజీ స్కీమ్‌లను అమలు చేస్తోందని, దీని బారినపడ్డ ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వేల సంఖ్యలో మల్టీలెవెల్ మార్కెటింగ్ సంస్థలు ఉన్నాయని, ఈ గొలుసు కట్టు వ్యాపారాలు సోషల్ టెర్రరిజంలా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. గొలుసుకట్టు, తదితర ఆర్థిక నేరాలపై దర్యాప్తు చేయడానికి, నివారించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రం పోస్టల్, పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలి

- ఏఐపీఆర్‌పీఏసీహెచ్ అధ్యక్షుడు కె.రాఘవేంద్రన్



పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐపీఆర్‌పీఏసీహెచ్ జాతీయ అధ్యక్షుడు కె.రాఘవేంద్రన్

చంపాపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోస్టల్, పెన్షనర్స్ సమస్యలను కేంద్రం వెంటనే పరిష్కరించాలని ఏఐపీఆర్‌పీఏసీహెచ్ జాతీయ అధ్యక్షుడు, ఎన్‌సీసీపీఏ సెక్రటరీ జనరల్ కె.రాఘవేంద్రన్ డిమాండ్ చేశారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ఆలంపల్లి కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆదివారం ఆలిండియా పోస్టల్ మరియు ఆర్ఎమ్ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ వి.రామారావు అధ్యక్షతన 20వ ద్వైవార్షిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.రాఘవేంద్రన్ హాజరై మాట్లాడుతూ గత కరోన సమయంలో సీనియర్ సిటిజన్‌లకు రైల్వే ప్రయాణంలో ప్రయాణ చార్జీలలో 50శాతం తొలగించారని, ప్రస్తుతం దాన్ని పునరుద్ధరించాలని ఆయన కేంద్రంను డిమాండ్ చేశారు. పెన్షనర్లకు రావలిసిన 18నెలల 35వేల కోట్ల కరువు భత్యంను మంజూరు చేయాలని, సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం సక్రమంగా లేదని అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో సీజీహెచ్ఎస్ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త పెన్షన్ విధానంను తొలగించి, పాత పెన్షన్ విధానంను ప్రవేశ పెట్టాలని కేంద్రంను కోరారు. 8వ వేతన సంఘంను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి యండి.జలాలోద్దీన్, ఏఐపీఆర్‌పీఏ జనరల్ సెక్రటరీ డికె.దేవనాథ్, పోస్టల్, పెన్షనర్లు పాల్గొన్నారు.

ముగిసిన కంఠమహేశ్వరస్వామి సురమాంబ దేవి విగ్రహ ప్రతిష్ఠ

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కవాడిపల్లిలోని కంఠమహేశ్వరస్వామి సురమాంబదేవి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆదివారం మధ్యాహ్నం కంఠమహేశ్వరస్వామిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జడ్పీటీసీ బింగి దేవదాసు గౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు సన్మానం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మాజీ వైస్ ఎంపీపీ రంగ యశోదజంగయ్యగౌడ్ ఏర్పాటు చేయించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని శనివారం రాత్రి భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొడిగె వెంకటేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, కొండల్‌గౌడ్, సురేష్‌గౌడ్, విష్ణుగౌడ్, పాపయ్యగౌడ్, వీరస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



శ్రీనిధికాలనీలో శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణంలో కార్పొరేటర్ వంగా మధుసూధన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

చంపాపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ శ్రీనిధి కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కరోత్సవ ప్రయుక్త వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయంలో ఆదివారం స్వామివారికి ఉదయం శాంతిపాఠం, ధ్వజాతోరణం, ధ్వజకుంభ ఆరాధన, పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణంను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో కార్పొరేటర్ వంగా మధుసూధన్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గరుడ వాహనంతో తిరువీధోత్సవంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు జగన్‌మోహన్‌రావు, రవీందర్‌రెడ్డి, గోపి, మధు, కృష్ణారెడ్డి, శంకర్, మురళి, రమేష్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పూర్ణ ప్రతిష్ఠ



చంపాపేటకు చెందిన మాతా అన్నపూర్ణేశ్వరీ అన్నదాన ట్రస్ట్ ఛైర్మన్ భగవాన్, చుక్కల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వేణు చుక్కల ఆదివారం యాదాద్రి జిల్లా రేణుకుంట గ్రామంలో నిర్వహించిన సంకల్ప సిద్ధి వేంకటేశ్వరస్వామి నూతన ఆలయ పూర్ణ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చుక్కల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కిషోర్ చుక్కల, పి.హరినాథ్, నాగరాజు పాల్గొన్నారు.

గెలిచిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తా

ఎంపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్



తట్టిఅన్నారంలో ఆల్ కాలనీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్. బూర నర్సయ్యగౌడ్ ఆదివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని ఆల్ కాలనీ సంఘాలు, పెద్ద అంబర్‌పేట్‌లోని అంబికానగర్ కాలనీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా తన గెలుపునకు కృషి చేయాలని నర్సయ్యగౌడ్ కాలనీ ప్రతినిధులను కోరారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. తట్టిఅన్నారంలోని పలు సమస్యలను కాలనీవాసులు నర్సయ్య దృష్టికి తెచ్చారు. దాంతో ఆయన గెలిచిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు చెట్టుపల్లి అంబేద్కర్, గంట ప్రభాకర్‌రెడ్డి, పిల్లి శ్రీనివాస్ యాదవ్, చారి తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ దరావత్, పక్కన ఏసీపీ శ్యాంసుందర్, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

చాదర్‌ఘాట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆదివారం సాయంత్రం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఇంటర్ కమిషనరేట్ చెక్ పోస్టు వద్ద మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీలను సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ దరావత్ పర్యవేక్షించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున నగదును రూ.50వేలకు మించి తీసుకెళ్లరాదని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఒకవేళ ఎవరైనా భారీ నగదుతో ప్రయాణిస్తూ పోలీసుల తనిఖీలో పట్టుబడితే ఆయా నగదును జిల్లా పర్యవేక్షణ అధికారికి అప్పగిస్తామన్నారు. పట్టు బడిన భారీ నగదుకు సంబంధించిన పత్రాలను చూపించి నగదు తిరిగి తీసుకోవచ్చన్నారు. సరైన పత్రాలు లేకుండా భారీ నగదు తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన నగదును సీజ్ చేయడంతోపాటు ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కింద కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు. భారీ నగదుతో పట్టుబడిన వ్యక్తుల వివరాలను ఆదాయపు పన్ను అధికారులకు తెలియజేస్తామన్నారు. అక్రమంగా నగదు, మద్యం, ఆయుధాలను తరలిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు చేపడతామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఇక నుంచి ఎన్నికల ప్రకియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలకు అనుసరిస్తూ ప్రవర్తించాలని సూచించారు.

సైదాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రీన్‌పార్క్ కాలనీ ప్రధాన రహదారిపై సైదాబాద్ పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా గుడారం ఏర్పాటు చేసి సీఐఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు, ఆర్పీఏ సిబ్బందితో కలిసి ఆదివారం సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో చర్యలు చేపట్టిందని తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయడం అమానుషం

- చింతల రవికుమార్

వనస్థలిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడం అమానుషమని వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వనస్థలిపురంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈడీ అధికారులు విచారణ పేరుతో అక్రమంగా కవిత ఇంటికి వచ్చి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. గతంలో కవిత పేరు ఎఫ్ఐఆర్‌లో పేరు లేదనీ కేవలం విచారణ చేపట్టి వెళ్లిన అధికారులు, ఇటీవల అక్రమంగా కవిత ఇంటికి వచ్చి కవితను అరెస్ట్ చేయడం అమానుష చర్యగా భావిస్తున్నామన్నారు. కేంద్ర కక్షపూరిత చర్యలు మానుకుని తక్షణమే కవితను విడుదల చెయాలనీ డిమాండ్ చేశారు.



జాతీయ బంజారా మిషన్ ఇండియా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణనాయక్

జాతీయ బంజారా మిషన్ (ఇండియా) రాష్ట్ర అధ్యక్షునిగా కృష్ణనాయక్

ఎల్‌బీనగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జాతీయ బంజారా మిషన్ (ఇండియా) రాష్ట్ర కార్యవర్గసమావేశం ఆదివారం లింగోజిగూడలోని గ్రీన్‌పార్క్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పాత కార్యవర్గాన్ని రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శిగా రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా రాజేష్‌నాయక్, ప్రసాద్ నాయక్‌లను ఎన్నుకున్నారు. బంజారాల హక్కుల కోసం తమ మిషన్ పనిచేస్తుందని కృష్ణనాయక్ తెలిపారు. ఈ సమావేశంలో బిచ్యానాయక్ బావాజీ, రవినాయక్, తులసీరామ్, సేవాలాల్, వెంకట్ రాథోడ్, లక్ష్మీబాయ్, దుర్గబాయ్, మంగ్లీబాయ్, శ్రీదేవి, సుజాత, అలివేలు, సీమా రాథోడ్ పాల్గొన్నారు.

ప్రణాళికతో ర్యాంకు 'పది'లం

(5వ పేజీ తరువాయి)

ఎగురవేస్తారని పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులకు వారు పలు సూచనలు చేశారు.

కేంద్రానికి వెళ్లే ముందు ఇవి చూసుకోవాలి..

- హాల్‌టికెట్, బ్లూ, బ్లాక్ పెన్నులు, పెన్సిల్, రబ్బర్, షార్ప్‌నర్, స్కేల్, తదితర వస్తువులను సరిచూసుకుని ఒకపౌచ్‌లో పెట్టుకోవాలి. పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులను, స్మార్ట్‌వాచ్‌లనుతీసుకెళ్లవద్దు.
- రోజూ రాత్రి 10 గంటలలోపు నిద్రపోయి, మరుసటి రోజు ఉదయం 5 గంటలకు మేల్కొవాలి. పరీక్షకు సంబంధించిన ముఖ్యాంశాలను ఉదయం పూట చదువుకోవాలి.

కేంద్రంలో పాటించాల్సిన పద్ధతులు..

- ఇన్విజిలేటర్ ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌పై మీ పేరు ఉందో.. లేదో సరిచూసుకోవాలి. ఇన్విజిలేటర్ చెప్పే సూచనలు తప్పకుండా పాటించాలి.
- కనీసం 15 నిమిషాల పాటు ప్రశ్నాపత్రాన్ని చదివి బాగా వచ్చే జవాబులను టిక్ చేసుకోవాలి.
- రాసిన అడిషనల్స్‌ను వరుసక్రమంలో పెట్టాలి. అన్ని సమాధానాలకు ప్రశ్నల నంబర్లు సరిగా వేశారో.. లేదో చూసుకోవాలి.
- జవాబుపత్రంలో ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే అక్కడ క్రాస్ మార్కు ఉంచి పీటీఓ అని రాయాలి.
- తీసుకున్న అడిషనల్ షీట్స్ నంబర్ల సంఖ్యను ఓఎంఆర్ షీట్‌పై తప్పనిసరిగా వేయాలి.
- గణితంలో సిద్ధాంతాలను వరుస క్రమంలో రాయాలి. ఫిజిక్స్, బయాలజీలో చిత్రాలను అందంగా వేసి వాటి పేర్లను, ఆవశ్యకతను వివరించాలి.

తల్లిదండ్రులు చేయాల్సినవి..

- పరీక్షలపై భయం పోగొట్టేందుకు తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యాన్ని ఇవ్వాలి. పరీక్ష బాగా రాస్తావని తరచూ వారిలో నమ్మకాన్ని పెంచాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో వారికి తోడుగా ఉండి, సబ్జెక్టులపై పునశ్చరణ చేయించాలి. ముఖ్యమైన పాయింట్స్‌ను గుర్తుంచుకునే విధంగా షార్ట్‌నోట్స్ రాయించాలి.
- ఉదయం 5 గంటలకు నిద్రలేపి 7 గంటల వరకు చదివించాలి. పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందు వెళ్లేలా సిద్ధం కావాలి. పిల్లలు సెంటర్ లోపలికి వెళ్లేవరకు అక్కడే ఉండాలి.
- పరీక్ష బాగా రాయకున్నప్పటికీ.. మరో పరీక్షలో ఎక్కువ స్కోర్ చేసే విధంగా ప్రోత్సహించాలి.

ఎక్కడి నుంచి వచ్చిందో చూడాలి



పరీక్షాకేంద్రంలో విద్యార్థులు టెన్షన్‌కు గురికావొద్దు. ప్రశ్నను జాగ్రత్తగా చదవాలి. ఎక్కడి నుంచి వచ్చిందో గమనించాలి. వచ్చిన వాటిని త్వరగా రాయాలి. గణితంలో వాస్తవ సంఖ్యలు, బహుపదులు, సమితులు, సాంఖ్యాకశాస్త్రం, సంభావ్యత, నిరూపణ రేఖాగణితం, రేఖీయ సమూహాల వ్యవస్థ, శ్రేణులు, జామితిలోని నిర్మాణాలను చూసుకుంటే 60శాతం మార్కులు కచ్చితంగా సాధించవచ్చు.

- నర్సింహారెడ్డి, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, జీహెచ్ఎస్ నల్లకుంట

విశ్వాసంతో పరీక్ష రాయాలి



ఏ ప్రశ్న వచ్చినా.. రాయగలను అనే విశ్వాసంతో విద్యార్థి పరీక్ష రాయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోల్చడం, నీవు సరిగా రాయలేవు, మర్చిపోతావు అనే మాటలను అనకూడదు.

- డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కౌన్సెలింగ్ థెరపిస్ట్

రంగారెడ్డి జిల్లాలో ఇద్దరికి నామినేటెడ్ పదవులు



చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): రంగారెడ్డి జిల్లాలో ఇద్దరు నేతలకు నామినేటెడ్ పదవులు దక్కాయి. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి పట్టణ మౌలిక సదుపాయల ఆర్థిక సంస్థ ఛైర్మన్ పదవి దక్కింది. మల్‌రెడ్డి రాంరెడ్డికి రోడ్డు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవి దక్కింది. ఈ సందర్భంగా వారు పార్టీ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్-1 ఖాళీ పోస్టులు 503 కాదు 1600 పోస్టులను భర్తీ చేయాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్

చాదర్‌ఘాట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో తీసుకున్న లెక్కలు శాఖల వారిగా ఖాళీగా ఉన్న పోస్టుల్లో చాలా తేడా ఉందని, ఖాళీ పోస్టులన్నింటిని లెక్కించి ఉద్యోగాల భర్తీకి తక్షణమే చర్యలు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఆర్ఏఆర్ ట్యూటోరియల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1లో 503 పోస్టులున్నట్లుగా ప్రకటించారు. వాస్తవానికి 1600 పోస్టులు ఖాళీగా ఉన్నందున డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హాయంలో పదేళ్లుగా గ్రూప్-1 పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న సంగీతారెడ్డి

చేవెళ్లలో బీజేపీని గెలిపించండి

బీజేపీ అభ్యర్థి 'కొండా' సతీమణి సంగీతారెడ్డి వినతి

సరూర్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మోడీ మళ్లీ ప్రధాని కావాలంటే రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక స్థానాలు కట్టబెట్టాల్సిన అవసరం ఉన్నదని, ఈ క్రమంలో చేవెళ్లలో ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని 'కొండా' సతీమణి సంగీతారెడ్డి కోరారు. ఆదివారం ఉదయం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందచెరువు వద్ద ఆమె మార్నింగ్ వాక్ చేసి, అక్కడి వాకర్స్‌తో భేటీ అయ్యారు. స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర, దేశ రాజకీయ పరిస్థితులపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పి.భిక్షపతిచారి, కె.హరినాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు గాజుల మధు, నూల ప్రభాకర్, ఆర్.యాదగిరియాదవ్, కె.కృష్ణారెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, బి.నర్సింహాయాదవ్, గోపీనాథ్, సుధాకర్, జేడీ కుమార్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీసాయినగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

మన్సూరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఆర్.ఎస్.రామకృష్ణ, ఎన్.లక్ష్మణ్ తెలిపారు. అధ్యక్షుడిగా పి.గణేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా పి.వి.రమణ మూర్తి, ఎం.అశోక్, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా పి.సత్తిరెడ్డి, పి.రవి, కోశాధికారిగా వై.హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.యాదగిరి, మురళీమోహన్ ఎన్నికైనట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786